క్లుప్తంగా

వైభవంగా ముక్కంటి కల్యాణం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మార్కెట్ సదుపాయం కల్పిస్తాం



మాట్లాడుతున్న ఏపీఎం డాంగేయాదవ్

సత్యవేడు: ఓఎన్డీసీలో రిజిస్టర్ చేసుకుంటే స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఆహార ఉత్పత్తులు విక్రయించడానికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులు తయారు చేసే సంఘాలకు 35 శాతం సబ్సిడీపై బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. ఉత్పత్తులు ప్యాకింగ్ చేసి విక్రయించే సంఘాలకు రూ.40 వేలు స్త్రీనిధి రుణం మంజూరు చేస్తామన్నారు. దీనికి 6 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల్లో నిరక్షరాస్యులైన వారు ఉంటే అదే గ్రూప్‌లోనే ఒకరిని వలంటీర్‌గా నియమిస్తామన్నారు. సంఘాలు ఏ గ్రేడ్‌కు చేరేందుకు చొరవ చూపాలన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి



విద్యాసామగ్రి అందజేస్తున్న ఎంఈఓ ప్రేమలత

ఏర్పేడు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని ఎంఈఓ ప్రేమలత అన్నారు. సోమవారం సాహసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పాతవీరాపురం, చిందేపల్లి, అముదూరు, బండివానిపల్లె, మునగలపాళెం పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సాహసం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శివకోటి, బాబు, ఉపాధ్యాయులు పద్మజ, వెంకటేశ్వర్లు, దేవరాజులు, ఉషారాణి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేష్

ఏర్పేడు: మండలంలోని పాయిల్‌సెంటర్‌లో తిరుపతి అమెరికన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కుక్కలగుంట, పాయిల్‌సెంటర్, గుండ్లకంఢ్రిగ, చెల్లూరు తదితర గ్రామాల నుంచి వచ్చిన 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 10 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరికి మంగళవారం తిరుపతిలోని అమెరికన్ లేజర్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ రాజేష్ తెలిపారు.

గౌడ సంఘాన్ని రద్దు చేసే అధికారం వారికి లేదు



గౌతులచ్చన్న విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: గౌడ సంక్షేమ సంఘాన్ని రద్దు చేసే అధికారం వారికి లేదని ఆ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం గౌతులచ్చన్న విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో తమ సంఘాన్ని రిజిస్టర్ చేశామని, అలాగే జూన్‌లో కార్యవర్గ ఎన్నికలు నిర్వహించామన్నారు. కొందరు తమ రాజకీయ లబ్ధి కోసం సంఘాలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే వారు తమ సొంత ప్రయోజనాల కోసమే అలా మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌గౌడ్, నారాయణస్వామిగౌడ్, ఆనంద్‌గౌడ్, బత్తయ్యగౌడ్, కన్నయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శుద్ధ జలం.. అందని ఫలం

ఐఎస్ఐ లేని వాటర్ ప్లాంట్లులు.. నిబంధనలకు నీళ్లు.. కొరవడిన అధికారుల పర్యవేక్షణ.. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న పూటకో ప్లాంట్.. వెరసి.. శ్రీకాళహస్తి పట్టణ వాసులకు శుద్ధజలం అందని ఫలంగా మారింది. ఫలితంగా పట్టణవాసులు వ్యాధుల బారిన పడుతున్నారు.



- పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న నీటి ప్లాంట్లు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని వాటర్ ప్లాంట్‌లు నిబంధనలు పాటించకపోవడంతో ప్రజలు కలుషిత నీటినే తాగాల్సి వస్తోంది. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పురపాలక కొళాయిల్లో నీరు రంగు మారి వస్తోంది. నీరు కలుషితం అయ్యాయన్న భయంతో ప్రజలు శుద్ధినీటి వైపు మొగ్గు చూపుతున్నారు. కొళాయి నీరు అవసరాలకు వాడుకున్నా, తాగడానికి మాత్రం ప్రజలు శుద్ధి నీరు ఒక క్యాన్ అయినా కొనుక్కుంటున్నారు. దీనితో పట్టణంలో శుద్ధినీటి పేరుతో పుట్టగొడుగుల్లా నీటి వ్యాపారా కేంద్రాలు వెలుస్తున్నాయి. పట్టణంలో ఇప్పటికే 35 వార్డులోల్ 52 కేంద్రాలు ఉండగా మరో 30 కేంద్రాలు ఎలాంటి ట్రేడ్ లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన ప్రతి వీధిలోనూ రెండేసి వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇన్ని తాగునీటి శుద్ధి కేంద్రాలున్నా ఒక్కదానికి కూడా ఐఎస్ఐ గుర్తింపు లేకపోవడం గమనార్హం. వీరు విక్రయిస్తున్న శుద్ధినీటిలో స్వచ్ఛత ఎంతన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనల మేరకు రసాయనాలను వినియోగించి నీటిని శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఇందుకు కొంత మొత్తాన్ని తప్పకుండా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే కొందరు నిర్వాహకులు శుద్ధి జల ప్లాంట్లలో పరిశుభ్రతను పాటించకుండా అపరిశుభ్రంగా ఉన్న క్యాన్లలోనే నీటిని సరఫరా చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పైగా 20 లీటర్ల క్యాన్ నీటిని రూ.15కు విక్రయిస్తున్నారు. ఇదేమిటని వినియోగదారులు ప్రశ్నిస్తే ఇష్టం ఉంటే తీసుకోండి. లేకపోతే లేదు.. అని నిర్వాహకుల నుంచి సమాధానం వస్తోంది. దీంతో గత్యంతరం లేక ఇలాంటి నీటిని తాగాల్సి వస్తోందని ఆయా కాలనీవాసులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వాటర్ ప్లాంట్ల యజమానుల ఇష్టారాజ్యానికి అడ్డూ, అదుపూ లేకుండా పోతోంది. ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తూ ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నారు.



ఆటోలో నీటి క్యాన్లను సరఫరా చేస్తున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులు

నిబంధనలకు నీళ్లు

ఒక కేంద్రంలోనూ కనీస నిబంధనలు పాటించకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. నిజానికి వినియోగదారులకు ఇచ్చే నీటిని తరలించే క్యాన్లను ఏడాదికోసారి మార్చాలి. కానీ నీటి వ్యాపారులు మాత్రం నీటి క్యాన్లు ఎంత అధ్వానంగా ఉన్నా వాటినే వినియోగిస్తున్నారు. అలాగే అనేక వాటర్ ప్లాంట్లను ఆయా యజమానులు శుభ్రం చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరికొన్ని తాగునీటి కేంద్రాల్లో అయితే తాగునీరు శుభ్రంగా ఉండడం లేదు. ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం నీటిలో ఖనిజాలు సంపూర్ణంగా ఉండాలి. వాటిలో మిల్లీ గ్రాము కాపర్, 0.3 గ్రాముల ఇనుము, 45 మిల్లీ గ్రాముల నైట్రేట్, 250 మిల్లీ గ్రాముల సల్ఫేట్, 200 మిల్లీ గ్రాముల క్లోరైడ్ ఉండాలి. నీటిని శుద్ధి చేసేందుకు ప్రతి వాటర్ ప్లాంట్లలో శాండ్ ఫిల్టరైజేషన్, మిక్స్‌డ్ బెడ్, డీమినరలైజేషన్, యాక్టివేటెడ్ డ్కార్బన్, తదితర దశలు ఉండాలి. వీటిలో చాలా వరకూ లేకుండానే ఎటువంటి ప్రమాణాలు పాటించకుండానే ప్లాంట్లులో ఏర్పాటు చేసుకున్న ట్యాంకుల ద్వారా డబ్బాల్లో నీటిని నింపి విక్రయిస్తున్నారు. మనం తాగేది స్వచ్ఛమైన నీరేనని ప్రజలు డబ్బులు చెల్లించి నీటిని మహాప్రసాదంలా కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే నీటి వ్యాపారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలుషిత నీటితో వ్యాధులు

“ కలుషిత నీటితో వ్యాధులు ప్రబలుతాయి. వాటర్ ప్లాంట్లలో శుభ్రత పాటించకుంటే ప్రజలు వ్యాధుల బారిన పడతారు. ముఖ్యంగా కీళ్లు, గ్యాస్, పొట్ట సంబంధింత వ్యాధులు వస్తాయి. మధుమేహవ్యాధిగ్రస్తులు కలుషిత నీటిని తాగితే మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఒంట్లో కాల్షియం పూర్తి స్థాయిలో తగ్గిపోయి ఎముకలో దృఢత్వం పూర్తిగా కోల్పోతుంది. వీలైనంత వరకూ ఇంటి వద్ద వచ్చే బోరు నీటిని వేడి చేసి ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసుకుని తాగితే మంచిది.

– డాక్టర్ బాలు, అర్బన్ హెల్త్ సెంటర్

అందరికీ నోటీసులు ఇస్తాం..

సుద్ద జలప్లాంట్లు నడుపుతున్న వారికి నోటీసులు ఇస్తాం. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాటిపై చర్యలు తీసుకుంటాం. ఐఎస్ఐ అనుమతి తీసుకోవాలని సూచిస్తామన్నారు. కొంత సమయం ఇచ్చి అందరిపై చర్యలు తీసుకుంటాం.

– గిరి కుమార్, పురపాలక కమిషనర్

శ్రీకాళహస్తిని ప్రక్షాళన చేస్తా

శ్రీకాళహస్తి: అక్రమ కట్టడాలను హైదరాబాద్ తరహాలో కూల్చివేసి, శ్రీకాళహస్తిని ప్రక్షాళన చేస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమస్యలు విని, ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పరిష్కారం కాని వాటిని ఎందుకు పరిష్కరించలేదో సంబంధిత అర్జీదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ ప్రజాదర్బార్‌లో సుమారు 170 ఫిర్యాదులు వచ్చాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

సాక్షిదినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించా

రూ.59 లక్షలు ఖర్చుపెట్టి శ్రీకాళహస్తిలోని కాలువల్లో పూడిక తీశామని, అయితే చెంబేడు కాలువకు వెళ్లే మార్గం కన్నలి కాలువ, సాంబయ్య పాళెం కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయని సాక్షిలో కథనం వచ్చిందని, దానిపై స్పందించి శుభ్రం చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈగా మహ్మద్ అహ్మద్



మహ్మద్ అహ్మద్

వరదయ్యపాళెం : మండల హౌసింగ్ ఏఈగా మహ్మద్‌అహ్మద్ సోమవారం హౌసింగ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సూళ్లూరుపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. రెండేళ్లుగా మండల హౌసింగ్ ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుత బదిలీల్లో ఈ పోస్టును ఎట్టకేలకు భర్తీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏఈ మాట్లాడుతూ.. మండలంలో పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేసి పరిష్కరిస్తానని తెలిపారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం



అమర జవానుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ : విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్ఐ విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణాన్ని పురస్కరించుకొని సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో సిబ్బందితో కలసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రపంచమంతా రాత్రి నిద్రలో ఉన్నా మేల్కొని ప్రజలకు కాపలాకాసే ఒకే ఒక్కడు పోలీసని కొనియాడారు. నిత్యం అనేక పని ఒత్తిళ్లతో విధులను నిర్విర్తిస్తూ శాంతిభద్రతలను కాపాడడమే తమ బాధ్యతన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర జవానుల ఆత్మశాంతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శివకుమార్, హెడ్‌కానిస్టేబుల్స్ నాగరాజు, బాలగురవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న నూకతోటి రాజేశ్

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేశ్, కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన రోడ్లను బాగు చేయాలని, ప్రధానంగా సత్యవేడు, ఊత్తుకోట , నాగలాపురం, చిన్నపాండూరు, బీఎన్ కండ్రిగ, సూళ్లూరుపేట రోడ్లకు మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అలాగే పిచ్చాటూరు మండలంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు.

విజేతలకు బహుమతి ప్రదానం



బహుమతులు అందజేస్తున్న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చైర్మన్ జగన్నాథం నాయుడు

శ్రీకాళహస్తి : రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చైర్మన్ బొల్లినేని జగన్నాథం నాయుడు బహుమతి ప్రదానం చేశారు. పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ , ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ చైర్మన్ బొల్లినేని జగన్నాధం నాయుడు పాల్గొని జూడో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పుత్తూరు ప్రభాకర్ రాజు, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి: మండలంలోని భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణను సీపీఐ నాయకులు కోరారు. సోమవారం సీపీఐ నాయకులు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం మద్దిలేడు సర్వే నంబర్ 1లో 26 ఎకరాల ప్రభుత్వ భూమిని దళితులకు ఇవ్వాలన్నారు. అలాగే రామాపురం దళితులకు ఇచ్చిన భూములను సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మించల శివకుమార్, రాజయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరు.. వృథా కనరూ..!





ధ్వంసమైన కలుజు
వృథాగా పోతున్న చెరువునీరు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని బసవయ్య పాళెం చెరువుకు మూడు తూములు ఉంటే ఒక తూము పూర్తిగా దెబ్బతింది. దీంతో చెరువులోని నీరు వృథాగా పోతోంది. వర్షాలకు చెరువులోకి చేరిన నీరు వృథాగా అవుతుండడంతో చెరువు ఖాళీ అయ్యే ప్రమాదం ఉంది. మరోసారి వర్షం కురిస్తే చెరువులోని నీరు ఊరిపైకి వచ్చే అవకాశం ఉంది. నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముక్కంటిసేవలో ఎమ్మెల్సీ హరిప్రసాద్



మృత్యుంజయస్వామి సన్నిధిలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని సోమవారం ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

నాగలాపురం : ప్రత్యేక ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బాలాజీ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అక్షర జూనియర్ కళాశాలలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ శిబిరాలలో కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్, పుట్టిన తేదీల అప్‌డేట్ వంటి సేవలు అందించనున్నారు. మండలంలోని ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సరస్వతీదేవి విగ్రహప్రతిష్టకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

ఏర్పేడు: మండలంలోని రాజులకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట కోసం సోమవారం సర్పంచ్ చెంగల్‌రాజు ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నకుమార్ విన్నపం మేరకు సర్పంచ్ త్వరలో సరస్వతీదేవి విగ్రహప్రతిష్ట చేయనున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మునిరత్నం రాజు, గ్రామస్తులు రవి యాదవ్, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై శిక్షణ

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో కృత్రిమ మేధస్సుపై ఏఐసీటీఈ అటల్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌బీవీ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ రంగాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అతిథులకు ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రామాయణం సురేష్, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం



సేంద్రియ కూరగాయల విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, ఏపీఎం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ఎంపీడీవో , ఐకేపీ కార్యాలయాల వద్ద సోమవారం రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయల విక్రయాన్ని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఏపీఎం మునెయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ.. మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, వీయస్‌పురం, కనమనంబేడు, గ్రామాల్లో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయలు, వరి పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండిస్తున్నారని తెలిపారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలను తింటే ఆరోగ్యానికి మంచిదని సూచించారు. వరి, వేరుసెనగ, వాణిజ్య పంటలను ప్రతి ఒక్కరూ సేంద్రియ పద్ధతుల్లో పండించాలన్నారు. ఈ పద్ధతుల్లో సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందజేస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం , రైతు సాధికారిత రీసోర్సు పర్సన్స్ మునిశేఖర్‌రెడ్డి, ఆశా, రేవతి, రజిని, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలానికి ఉపాధిహామీ నిధులు రూ. 2 కోట్లు మంజూరయ్యాయని వీటితో సిమెంట్ రోడ్డు పనులు అన్ని పంచాయతీల్లో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు పేర్కొన్నారు. సోమవారం పీఆర్ ఏఈ నాగరాజు, ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం , ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, ఐకేపీ ఏపీఎం మునెయ్య, ఏపీవో భానుప్రియ, ఏవో భారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్పలతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. తుపాను నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాలల్లో పారిశుధ్యం లోపించిందన్నారు. వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని, దోమల సంతతి పెరగకుండా వీధుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా బోరు మోటారు, పైపులైన్లు, చేతిపంపులకు మరమ్మతులు చేయించాలని, తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్‌లను పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు , గర్భిణులు , పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

వీఆర్‌ఓలు, సర్వేయర్లకు తహసీల్దార్ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోమవారం కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు. గ్రామ స్థాయి అధికారులందరూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. భూసమస్యల పరిష్కరంలో అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబునాయుడు, మండల సర్వేయరు రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో కార్డెన్ సెర్చ్



బీసీకాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి సూచనలతో సోమవారం పట్టణంలోని తొట్టంబేడు బీడీ కాలనీలో బీఎన్‌కండ్రిగ సీఐ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అందులో భాగంగా అనుమానితులు, వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని ఏడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సైబర్‌క్రైమ్, 100 గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.